# సింగిల్ పేజీ కథలు

**నిండుగా తెల్లవారింది. ఓ వెలుతురు చుక్క కనురెప్పల్ని వాడిగా పొడిచే సరికి కళ్లు తెరవక తప్పలేదు. బద్ధకంగా ఒళ్లు విరుచుకోబోయాను. ఊహూ...శరీరమంతా విపరీతమైన నొప్పి... ఏ భాగమూ సహకరించలేదు. ఎముకలు విరగలేదన్న మాటేగానీ, ఒళ్లు కుళ్లబొడిచినంత బాధ.**

నిన్న సాయంత్రం తగిలిన దెబ్బలకి రాత్రి కాపడం పెట్టించుకోవడం, నొప్పితో, మనసుపడ్డ బాధతో బాగా లేటుగా ఏ తెల్లవారుఝామునో నిద్రపట్టడం, ఈ రోజు డ్యూటీకి వీక్లీ ఆఫ్ కావడంతో కొంచెం లేటుగానే నిద్రలేచాను.

"మరి కాసేపు పడుకోలేకపోయావా! సర్లే... పళ్లు తోముకో...టీ తెస్తాను" సీత నా చేతిలో బ్రష్ పెట్టి, పేస్ట్ వేసింది.

నాకు తెలుసు...ఈ పిచ్చిది రాత్రంతా పడుకుని ఉండదు...నేనంటే అంత ప్రేమ దానికి...

"నొప్పి తగ్గిందా నాన్నా" ఆత్మీయత నిండిన స్పర్శ...నా చిన్నితల్లి సంగీతది. జరిగిన విషయం దాని చిన్ని మనసుకి అర్థంకాకపోయినా, నాకు దెబ్బలు తగిలాయన్నది మాత్రం గ్రహించగలిగింది ఆ ఆరేళ్ల చిన్నది...నా కూతురు.

సంగీత నా నుదురు మీద ముద్దు పెట్టుకుంది...

నా మనసుకో స్వాంతన...శరీరానికి ఉత్సాహం...

బ్రష్ చేసేసరికి టీ గ్లాసుతో సీత సిద్ధం...

డబ్బు పరంగా చూస్తే నేను ఏమీ లేనివాడ్నే...నా కుటుంబ పరంగా చూస్తే ఎప్పుడూ పేదవాడ్ని కాదు... అనురాగవతియైన భార్య, అభిమానించే బిడ్డ, ఆప్యాయత చూపే అమ్మా నాన్న...

కోట్లు డబ్బు ఉంటే సుఖశాంతులు లేని ఎందరో ధనవంతుల్ని మించిన ధనవంతుడ్ని నేను...అదే నా బలం... అదే నా రక్షణ...అదే నా ధైర్యం...

ఆ ధైర్యం నాకు సాహసాన్నిస్తుంది...

కర్తవ్య నిర్వహణలో వెన్నుచూప వద్దంటుంది...

నేను ఏవేవో ఆలోచనల్లో ఉండగానే పరిగెత్తుకుంటూ వచ్చాడు వెంకటరావు.

హడావుడిగా ఉన్నాడేమో...ఆయాసంతో వగరుస్తున్నాడు.

వాడు చెబుతున్నది అర్థమయ్యేసరికి, నాకెందుకో భయంకరమైన నిస్సత్తువ ఆవహించింది.

"అచ్యుతాపురం గేటు" నాలో నేనే గొణుక్కున్నాను. నిన్నటి సంఘటన జరిగింది అక్కడే..

రైల్వే గేట్ మాన్‌గా డ్యూటీ అక్కడే... మరో అరగంటలో డ్యూటీ అయిపోతుంది.

కోణార్క్ ఎక్స్‌ప్రెస్ వెళ్లేవేళ కావడంతో గేటు క్లోజ్ చేసి జెండా పట్టుకు నిలబడ్డాను.

సరిగ్గా అప్పుడే...

## కర్తవ్యం

దుమ్ము రేపుకుంటూ విపరీతమైన వేగంతో దూసుకొచ్చాయి నాలుగు కార్లు...రెండు జీపులు...

సడన్‌గా గేటు ముందు బ్రేక్ కొట్టినప్పుడు వచ్చిన క్రీచ్‌మనే శబ్దమే చెబుతోంది వాళ్లెంత దూకుడుగా ఉన్నారో.

"రేయ్...గేటు తియ్ రా"

ఉలిక్కిపడ్డాను...

సాటి మనిషికి కనీస మర్యాదనివ్వలేని అహంకారపూరితమైన కర్కశ స్వరం..

నా కుడిచేతి పిడికిలి బిగుసుకుంది. రాబోతున్న కోపాన్ని తమాయించుకోవడానికి వంద నుండి అంకెలు వెనక్కి లెక్క పెట్టుకుంటున్నాను.

"చెబుతుంటే కదలవేంటి బే...తియ్ గేటు...అవతల ఎమ్మెల్యే గారికి లేటయిపోతోంది" బాగా బలిసిన దున్నపోతులా ఉన్న జులపాల జుత్తుగాడొకడు జీపు దిగి, అంతే వేగంగా నా దగ్గరికొచ్చాడు.

"సార్...కోణార్క్ పాస్ అయ్యే టైమైపోయింది సార్. జస్ట్ ఫైవ్ మినిట్స్ అంతే..." నా గొంతులోకి వినయాన్ని ఒంపుకుని చెప్పాను.

"నీ...యు...గేటు తియ్ బే... అర నిమిషంలో క్రాస్ చేసేస్తాం.."

నా రక్తం సలసల మరిగిపోతోంది.

"అది చాలా ప్రమాదం సార్. నే..నేను తియ్యను..." నేను డ్యూటీకి బద్దుడిని. నిజంగానే గేటు తీయడం చాలా ప్రమాదం.

"ఎంట్రా లేటు.." అంటూ అసలు కథానాయకుడు. అదే మావూరి ఎమ్మెల్యే 'రాంగోపాల్' కారు దిగారు. ఆపై ఒక్కరొక్కరుగా అతడి సేన..ఆడా...మగా...నాకు ఆయన గారి ఫ్యామిలీ తెలుసు...ఇప్పుడు కనిపిస్తున్న జనాల్లో ఆయనగారి తాళికట్టిన భార్య కనబడలేదు. ఆ స్థానంలో ఉంపుడుగత్తె ఊర్మిళాదేవి...ఆమె పరివారం ఉన్నారు.

అయినా అవన్నీ నాకనవసరం...నా డ్యూటీ నాది...

"పెళ్లికి లేటుగా వెళ్తే మా కజిన్ సిస్టరు ఫీలవుద్ది గోపాలూ...కనీసం మూడు గంటలు ముందొస్తామని మాటిచ్చినాం కదా.. ఒక్క నిమిషం గూడా ఆలస్యం కావడానికి వీల్లేదు..." కారు దిగాక కూడా ఊర్మిళాదేవి పోతున్న నయగారాలు నాకు తెలుస్తూనే ఉన్నాయి.

"కక్కుర్తి నా కొడకా...పైసల కోసమే గదరా నీ నకరాలు...ఇదిగో వంద...గేటు తియ్.."

సిటింగ్ ఎమ్మెల్యేగారు గదూ... దయార్థ హృదయులు...ఉదారంగా నాకేసి విసిరి, ఉంచుకున్న దాని వైపు తిరిగి కన్నుకొట్టారు. ఇప్పుడు చూడు గేటు ఎలా తెరుచుకుంటుందో అన్నట్లుగా...

అయితే నా రియాక్షన్‌కి షాక్ తినడం ఆయన వంతయింది.

"క్షమించండి సార్...గేట్ వేయడం, తీయడం నా డ్యూటీలో భాగం... నాకు దానికి జీతం వస్తుంది...రైలు వెళ్లిపోగానే, మీరు చెప్పకపోయినా నేనే గేటు ఎత్తేస్తాను" కింద పడ్డ వంద నోటు తీసి దులిపి, ఆయన చేతిలో పెట్టేసరికి ముఖం కందగడ్డలా మారిపోయింది.

"నాకే నీతులు చెబుతావ్రా...లేబరు నా యాలా..." చెయ్యెత్తాడు కొట్టడానికి...ఇదే అదనుగా చెంచాగాళ్లు రెచ్చిపోయారు. ఫలితం...నాకు దేహశుద్ధి...

జరుగుతున్న దాన్ని ఇంకా కొంతమంది చూస్తున్నా వాళ్లంతా మౌనప్రేక్షకులుగానే ఉండిపోయారు.

ఈలోగా ట్రైన్ వెళ్లిపోయింది. ఆ తర్వాత వాళ్లూ వెళ్లిపోయారు.

విషయం తెలుసుకున్న సీత ఆవేశపడింది. విషయాన్ని కంప్లైంట్ చేద్దామని మిత్రులూ సలహా ఇచ్చారు.

నాకు తెలుసు...అప్పుడు ఇది పత్రికలకెక్కుతుంది. రాజకీయ రంగు పులుముకుంటుంది. ఎవరిది నిజమైన సహాయమో, ఎవరిది కపట సానుభూతో తెలియనంతగా నేను పావునైపోతాను...అందుకే జరిగిన దాన్ని అక్కడే వదిలేద్దామని నిర్ణయించుకున్నాను.

కానీ...

ఇప్పుడు...వెంకటరావు చెప్పినవార్త...

"పెళ్లి నుండి తిరిగొస్తూ, అచ్యుతాపురం క్రాసింగ్ దగ్గర, బలవంతాన గేటు తెరిపించి వస్తుంటే, రైలు గుద్దేసి, పదిమంది మరణం...మరో పదిహేనుగురికి గాయాలు...చావుబ్రతుకుల్లో ఎమ్మెల్యే రాంగోపాల్..."

నేను హాస్పిటల్‌కి వెళ్లి అతడ్ని పరామర్శించడానికే నిశ్చయించుకున్నాను.

-సి.వి.నరసింహదాసు (కోలకతా